ప్రజాశక్తి

ఆదివారం 26 ఫిబ్రవరి 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

మరమ్మతుల్లేవు..!

ప్రమాదకరంగా విద్యుత్ లైన్లు - ఈ వేసవిలో అయినా పనులు చేసేనా?

విద్యుత్ స్తంభం వద్ద తీగలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఆకు కదిలినా... చినుకు పడినా విద్యుత్ సరఫరాకు అంతరాయం వేసవిలో పరిపాటవుతోంది. కొనేళ్లుగా వేసవిలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి గంటల తరబడి సరఫరా నిలిచిపోతోంది. ఇలాంటి సందర్భాల్లో వినియోగదారులు ఉక్కపోత, తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రాత్రి వేళ సరఫరాకు అంతరాయం ఏర్పడితే గ్రామీణ ప్రాంతాల్లో తెల్లవారే వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాదైనా విద్యుత్ అధికారులు వేసవి తీవ్రత పెరగక ముందే లైన్ల మరమ్మతులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నరసరావుపేట పట్టణంబరంపేటలో ఇటీవల విద్యుద్ఘాతంలో మృతి చెందిన కార్మికుడు

కొన్ని ప్రాంతాల్లో దశాబ్దాల కిందట వేసిన లైన్లు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. 11కెవి తీగలకు 100 స్క్వయర్ పరిమాణం తీగలు (కండక్టర్), 33 కెవికి 150, ఎల్‌టి లైన్లకు 55 స్క్వయర్ పరిమాణం ఉన్న తీగలు మార్చాల్సి ఉంది. కొన్ని గ్రామాల్లో మార్పులు చేపట్టకపోవడం వల్ల సరఫరాకు అంతరాయం అనివార్యమవుతోంది. వ్యవసాయ విద్యుత్ వినియోగంలో పొలంలోకి వెళ్లిన రైతులకు పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యుత్ లైన్లు అస్తవ్యస్తంగా ఉండటం వల్ల ప్రమాదాలు వాటిల్లుతున్నాయి.

జిల్లాలో ఖరీఫ్ సాగు దాదాపు పూర్తయింది. రబీలో సాగు చేసిన పైర్లు కోతలకు సిద్ధమవుతున్నాయి. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు పొలాల్లో లైన్ల ఏర్పాటు, మరమ్మతులకు రానున్న నెల రోజులు అనువైన సమయంగా ఉంది. కానీ విద్యుత్ సరఫరాలో సమస్యలు, ఫీడర్స్ మార్పు, పాత లైన్ల స్థానంలో కొత్త లైన్లు ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించలేదు. ప్రధానంగా విద్యుత్ శాఖ గుంటూరు జిల్లా కార్యాలయంలోనే వెయ్యికి పైగా విద్యుత్ పీడర్లు పడి ఉన్నాయి. ఇవి పాడవుతున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

2లో

సిఎం తెనాలి పర్యటన 28వ తేదీకి వాయిదా

2లో

కొనసాగుతున్న ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

సభా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న బారీకేడ్లు

కాలం తీరిన ఎరువులు సీజ్

దుకాణంలో మందులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - నూజెండ్ల

మండల కేంద్రమైన నూజెండ్లలోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. మన్విత ట్రేడర్స్, ప్రసన్నాంజనేయ ట్రేడర్స్ షాపుల్లో పరిశీలించిన అధికారులు కాలం తీరిన రూ.2.70 లక్షల పురుగు మందులను సీజ్ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారి శ్రీహరిరావు, ఏవో అంకారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి. వేదికపై పి.మధు, వి.కృష్ణయ్య తదితరులు

పేదల భూములను తిరిగివ్వకుంటే దశలవారి పోరాటం ఉధృతం

- 15వ తేదీలోగా బాధితులకు న్యాయం చేయాలి
- అసైన్డ్ భూముల పరిరక్షణ సదస్సులో పి.మధు

వార్త మెయిన్‌లో

తహశీల్దార్‌పై అట్రాసిటీ కేసు పెట్టాలి

సిఐటియు డిమాండ్ - దాడికి గురైన విఆర్‌ఎకు పరామర్శ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఫేస్ రికగ్నేషన్ యాప్‌లో హాజరు వేయలేదననే కారణంతో కొమెరపూడికి చెందిన విఆర్‌ఎ కొరబండి శ్రీనివాసరావును దూషించడంతోపాటు చేయిచేసుకున్న తహశీల్దార్ కె.నగేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సిఐటీయు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ డిమాండ్ చేశారు. సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడు శ్రీనివాసరావును నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ కింది స్థాయి ఉద్యోగులపై ఈ తరహా ప్రవర్తన సరికాదని, విఆర్‌ఎకు తహశీల్దార్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని అన్నారు. విఆర్‌ఎ శ్రీనివాసరావు పక్షవాతం నుండి ఇటివలే కోలుకున్నారని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.హరిపోతారాజు, సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్, విఆర్‌ఎల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్, డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంజీవరావు, సుబ్బారావు, డివైఎఫ్ఐ నాయకులు జె.రాజ్‌కుమార్ ఉన్నారు.

విఆర్ఎ శ్రీనివాసరావును పరామర్శిస్తున్న సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయ నాయక్ తదితరులు

టిడిపి నేతల్లో దిగులు, గుబులు! వీక్షణం

8లో

మరమ్మతుల్లేవు..!

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఎక్కువగా ఉన్న బొల్లాపల్లి, వెల్దుర్తి, ఈపూరు, నకరికల్లు తదితర ప్రాంతాలతో పాటు కృష్ణానది కరకట్ట లోపల ఉన్న లంక గ్రామాలు, ఆక్వా చెరువుల వద్ద విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిపై పలువురు ఆయా జిల్లాల కలెక్టర్ల వద్ద స్పందనలో ఫిర్యాదులు చేస్తున్నారు. కలెక్టర్ల నుంచి వచ్చిన విజ్ఞాపనలపైనే విద్యుత్ అధికారులు కొంత వరకు స్పందిస్తున్నారని మిగతా వాటిపై దృష్టిసారించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

రహదారులను విద్యుత్ లైన్లు దాటే క్రమంలో తక్కువ ఎత్తులో ఉండం వల్ల గడ్డి ట్రాక్టర్లు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉంది. విద్యుత్ లైన్లు రోడ్లను దాటే క్రమంలో 9.1 మీటర్ల స్తంభాలు వేయాలన్న నిబంధన కొన్నిచోట్ల అమలు కావడం లేదు. గతంలో 8 మీటర్ల స్తంభాలు వినియోగించారు. ఇప్పుడు వీటిని నిలిపివేశారు. ఇంకా 9.1 మీటర్ల స్తంభాలు పూర్తిగా అందుబాటులోకి రాలేదు. కొన్నిచోట్ల విద్యుత్ లైన్లు ఇళ్ల మధ్య చేతికి అందేంత దూరంలో ఉన్న పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా అవుతున్న అల్యూమినియం వైరుకు పివిసి పైపులు తగిలించి తాత్కాలికంగా ప్రమాదాల బారిన ఏర్పాట్లు చేస్తున్నా ఇంకా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాల్సి ఉంది.

డయల్ యువర్ డిఎంకు పలు వినతులు

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక గుంటూరు-2 డిపోలో డయల్ యువర్ డిఎం కార్యాక్రమంలో శనివారంఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుండి వినతులు రాగా వాటినిడిపోమేనేజర్ అబ్దుల్ సలీం స్వీకరించారు. జూపూడి నుండి గుంటూరుకు బస్సు ఉదయం 07:15 గంటలకె వెళ్ళడం వలన ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతోందని, గతంలో మాదిరి 8.15 గంటలకు నడపాలని పొన్నూరు మండలం బ్రాహ్మణకోడూరుకు చెందిన డి.రాజు కోరారు. గుంటూరు నుండి విజవాడ రైల్వే స్టేషన్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని గుంటూరుకు చెందిన రవిచంద్ర ప్రసాద్ కోరగా పరిశీలిస్తామని డిఎం చెప్పారు. నల్లపాడు స్కూల్స్ వద్ద ఆర్‌టిసి బస్సులు వేగంగా వెళ్తున్నాయనినల్లపాడుకు చెందిన సునీతరెడ్డి, పండగ వేళల్లో మంగళగిరి నుండి కనిగిరికి బస్సు సదుపాయం కల్పించాలని మంగళగిరికి చెందిన శ్రీనివాసరెడ్డి కోరారు. గుంటూరు బస్ స్టేషన్ నందు స్టాల్స్ మరియు తినుబండరాలు షాప్ లలో ఎక్కవ రేట్లను వసూలు చేస్తున్నారని శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు. పేరేచర్ల నుండి తెనాలికి బస్సు వేయాలని పలకలూరుకు చెందిన వ్యక్తి కోరగా ప్రయాణికులు సరిగా లేరని డిఎం సమాధానమిచ్చారు. గుంటూరు నుండి రాజమండ్రికి బస్సు నడపాలని లక్ష్మీపురానికి చెందిన వ్యక్తి కోరగా పరిశీలిస్తామని డిఎం చెప్పారు.

నేడు అవగాహన సంస్థ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి- గుంటూరు

అవగాహన సంస్థ 32వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నేడు ఆదివారం స్థానిక బృందావనం గార్డెన్స్, 5వ లైన్‌లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్నట్లు అవగాహన సంస్థ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 31 సంవత్సరాల క్రితం అవగాహన మొట్టమొదటి కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త, హిందూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ డి. ఎన్. దీక్షిత్ ఈ 32వ వ్యవస్థాపన దినోత్సవం సభకు కూడా అధ్యక్షత వహిస్తారని,కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఈ 32వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తారని అవగాహన సంస్థ తెలియజేస్తుంది. అవగాహన సంస్థ సభ్యులు, అభిమానులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

గుండె జబ్బులపై నేడు సదస్సు

అవగాహన సంస్థ ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆరోగ్య సభలలో భాగంగా ఈ వారం గుండె జబ్బులు - కారణాలు - చికిత్స అన్న అంశంపై అవగాహన బృందావన్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి శనివారం తెలిపారు.

తెనాలి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

గుంటూరు లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

సిఎం పర్యటన 28వ తేదీకి వాయిదా

కొనసాగుతున్న ఏర్పాట్లు - పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-తెనాలి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెనాలి పర్యటన వాయిదా పడింది. ఈనెల 27న ఉదయం మార్కెట్ యార్డు ప్రాంగణంలో రైతు భరోసా పంపణీలో పాల్గొనాల్సి ఉంది. అయితే అనివార్య కారణాలతో ఆయన పర్యటన ఈనెల 28కి వాయిదాపడినట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు శనివారం తెలిపాయి. అయితే తేదీ మార్పు మినహా, కార్యక్రమంలో ఎటాంటి మార్పులేదని వెల్లడించారు. ఈ నేపథ్యంలో సిఎం రాకకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. యార్డు ప్రాంగణంలో సభావేదిక ముస్తాబౌతోంది. ఎమ్మెల్సీ తలశిత రఘురాం పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. వేదిక ఎదురు ఇరువైపులా ప్రజలు కూర్చునేందుకు, వేదికకు చేరుకునేందుకు మధ్యలో ఐరన్ గ్రిల్స్‌తో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. సభా వేదికకు పెద్దపెద్దకూలర్లను సమకూర్చుతున్నారు. ఓవైపు హెలిప్యాడ్ ఏర్పాట్లు సాగుతుంటే నిఘా విభాగం, పోలీసులు ఆ ప్రాంతంలో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.

హెలిప్యాడ్ నుంచి సభకు రోడ్డు నిర్మాణం

హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో మార్కెట్ యార్డులోని సభా వేదికకు ముఖ్యమంత్రి చేరుకునేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. యార్డు మెయిన్ గేట్ నుంచి సభావేదికకు చేరుకునేందుకు యార్డు ఆవరణలోని వేర్‌హౌసింగ్ గోడౌన్ల మధ్య ప్రత్యేకంగా రోడ్డు నిర్మిస్తున్నారు. రూ.12.50లక్షలతో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో 440 మీటర్ల పొడవున రోడ్డు నిర్మాణం సాగుతోంది. అయితే వాస్తవానికి రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నల్ల రోడ్డు మెటల్‌కు బదులు తెల్ల రాయి ముక్కలు, డస్ట్‌ను రోడ్డుకు ఉపయోగిస్తున్నారు. దీనిపై డిఈ శ్రీనివాస్ వివరణ కోరగా రోడ్డు నిర్మాణం పటిష్టంగానే జరుగుతుందని, రెడిమిక్స్‌ను ఉపయోగిస్తున్నామన్నారు. శాశ్వత ప్రాతిపదికనే నిర్మాణం జరుగుతుందన్నారు.

సీఎం సభ ఏర్పాట్లు పరిశీలన

ఈనెల 28న రైతు భరోసా పంపిణీ ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెనాలి రానున్న నేపథ్యంలో సభాప్రాంగణాన్ని, ఏర్పాట్లను వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్ శనివారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, రూరల్ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఎమెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి యార్డు ప్రాంగణంలో పర్యటించిన ఆయన బహిరంగ సభావేదిక, గ్యాలరీ, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో సిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి అధికారులతో సమీక్ష జరిపారు. కలెక్టర్ మాట్లాడుతూ సిఎం సభకు వచ్చే రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. తొక్కిసలాటకు తావులేకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని సభా ప్రాంగణంలో తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచాలన్నారు. సభా ఏర్పాట్లకు కేటాయించిన సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శంకరనారాయణశర్మ, సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి, జెడ్పీ సీఈఓ మోహనరావు, మెప్మా పిడి వెంకటనారాయణ, డీఆర్‌డిఏ పిడి హరిహరనాథ్, డ్వామా పిడి యుగంధర్‌కుమార్, పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఆర్అండ్‌బి ఎస్ఈ నిర్మల, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ అధికారిణి సుజాత, జిల్లా వైద్యారోగ్యశాఖ అధకారి శ్రావణబాబు, డిఎస్పీ కె.స్రవంతిరాయ్, కమిషనర్ ఎం.జస్వంతరావు, తహశీల్దార్ కె.రవిబాబు, యార్డ్‌సెక్రటరీ జెవి సుబ్బారావు పాల్గొన్నారు.

సిఎం పర్యటనపై జనసేన విమర్శలు

జిల్లాలో 300 మంది కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడితే పట్టించుకోని ప్రభుత్వం రైతు భరోసా అంటూ సిఎం పర్యటనకు ఆర్భాటం చేయటం సిగ్గుచేటని జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు విమర్శించారు. స్థానిక కొత్తపేటలోని ఆ పార్టీ పిఏసి చైర్మన్ మనోహర్ నివాసంలో శనివారం ఆయన మాట్లాడుతూ బటన్ నొక్కటం జగన్‌కు అలవాటైందని, కేవలం ప్రచారం కోసమేనని ఎద్దేవా చేశారు. గతంలో మనోహర్ హయాంలో తెనాలి అభివృద్ధి చెందిందని, వైసిపి హాయంలో అభివృద్ధి శూన్యమన్నారు. అభివృద్ధికి నిధులు కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే ముఖ్యమంత్రిని నిలదీయాలన్నారు. ఆత్మహత్యలకు పాల్పడిని రైతులపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, ఆకుటుంబాలను జనసేన ఆదుకుందని గుర్తు చేశారు. సభలు, సమావేశాలతో ప్రజాధనం ధుర్వినియోగం చేయకుండా, ఆ సొమ్మును రోడ్ల నిర్మాణానికి ఉపయోగిస్తే ప్రజలు హర్షిస్తారన్నారు. సమావేశంలో చేనేత విభాగం నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు బందోబస్తుపై సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెనాలిలో ఈనెల 28న సిఎం జగన్ పర్యటన సందర్భంగా పోలీసు అధికారులతో ఎస్పి ఆరీఫ్ హఫీజ్ శనివారం గుంటూరులో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఎస్పి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వర్యులు పర్యటించే ప్రాంతాలను పరిశీలించి,అక్కడ తీసుకోవలసిన భద్రత పరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించారు. తెనాలి పట్టణంలో మార్కెట్ యార్డులో జరిగే సభ పై ఆశీనులయ్యే వివిఐపిల స్టేజిని పరిశీలించాలన్నారు. దారి వెంట బారికెడ్లను ఏర్పాటు బైలైన్స్ లో ఎవరికి ఇబ్బందులు లేకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద భద్రత,సభా ప్రాంగణాల వద్దకు చేరుకోవడానికి ట్రాఫిక్ నియంత్రణ మరియు మళ్లింపు, విఐపిల రాకపోకలు సాగించే రహదారుల ఎంపిక మొదలగు వివిధ అంశాల గురించి అధికారులతో చర్చించారు. సిఎం పర్యటనలో అధికారులు తగిన జాగ్రత్తలతో పనిచేయాలన్నారు. మొత్తం 610 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నట్లు ఎస్పి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిలు సుప్రజ, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, డిఎస్పిలు సీతారామయ్య, శ్రీనివాసరావు, స్రవంతిరాయ్, పోతురాజు, ప్రకాష్ బాబు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సిఎం సభకు ముస్తాబౌతున్న సభావేదిక

కవిరాజా లేఔట్‌లో హెలిప్యాడ్‌కు ఏర్పాట్లు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్

రోడ్ల విస్తరణతో గ్రేటర్ లుక్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో రోడ్ల విస్తరణతో గ్రేటర్‌లుక్ రానున్నదని, నగరంలో మౌలిక వసతుల కల్పనకు పాలకవర్గం కృషి చేస్తుందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు.శనివారం నగరంలోని సంజీవయ్య నగర్ రైల్ గేటు నుండి రెడ్డి పాలెం ఇన్నర్ రింగ్ రోడ్ వరకూ చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను స్థానిక కార్పొరేటర్లు, అధికారులు,వైసిపి నాయకులతో కలిసి మేయర్ పరిశీలించి పనుల వేగవంతానికి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రధాన రోడ్ల విస్తరణను వైసిపి అధికారంలోకి వచ్చిన నాటినుండి విస్తృతంగా చేపడుతుందన్నారు. విస్తరణలో నష్టపోతున్న ప్రతి ఒక్కరికి తగిన నష్టపరిహారం అందిస్తున్నామన్నారు. సంజీవయ్య నగర్ నుండి రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్‌రోడ్డుకు వెళ్ళే రోడ్డును మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగులకు విస్తరణ చేస్తున్నామన్నారు. విస్తరణ పనులకు సంబంధించి అధికారులు స్థానిక కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని చట్ట ప్రకారం నోటీసులు, నష్ట పరిహారం, టి.డి.ఆర్ బండ్లు తదితర అంశాలను విస్తరణలో నష్టపోతున్న వారికి అవగాహన కలిగించి పనులు చేపట్టాలన్నారు. అనంతరం మేయర్ సంజీవయ్య రైల్వే గేటు వద్ద జరుగుతున్న పైప్ లైన్ అనుసంధాన పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వైసిపి గుంటూరు తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్.నూరి ఫాతిమా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, కార్పొరేటర్లు మల్లవరపు రమ్య, ధూపాటి వంశీ, పాపతోటి అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణను పరిశీలిస్తున్న మేయర్, తదితరులు

వినుకొండలో వరుస చోరీలు..!

- భయాందోళనలో ప్రజలు, వ్యాపారులు
- పోలీసులు దృష్టి సారించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో వ్యాపారులు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. చిరు వ్యాపార సంస్థలు, కిరాణా, ఫ్యాన్సీ, మెడికల్ తదితర వ్యాపార సంస్థల లక్ష్యంగా దొంగలు బరితెగించి దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, బ్యాంకులు తదితర జనసంచార ప్రాంతాల్లో దొంగతనాలు పెరిగాయి. పట్టణంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజల్లో భయాందోళన నెలకొంది. పట్టణంలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు విఫలమయ్యారనే చెప్పాలి. గురువారం మార్కాపురం రోడ్డులోని అచ్యుత మూర్తయ్య కిరణా షాప్ లో దొంగతనం జరిగింది. గత మూడు రోజుల క్రితం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎదురుగా మెడికల్ షాపులో దొంగతనం జరిగి నగదు అపహరించారు. మరో రోజు ఆర్టీసీ బస్టాండ్ లో ఒక మహిళ బస్సు ఎక్కేందుకు వేచి ఉండగా ఆమె వద్ద ఉన్న నగల బ్యాగులు దొంగలు అప హరించుకు వెళ్లారు. అలాగే పట్టణంలోని కొత్తపేట కష్ణవేణి కాలేజీ వద్ద గల ఒక ఇంట్లో ఇటీవల నగల చోరి జరిగింది. అలాగే ఇటీవల పట్నంలో ద్విచక్ర వాహ నంపై వెళ్తున్న బంగారు వ్యాపారికి చెందిన వెండి వస్తు వులు అపరిచి వెళ్లారు. ఒక వ్యక్తి బ్యాంకు నుండి డబ్బులు డ్రా చేసుకొని వెళుతుండగా ట్యాంక్ బ్యాగులో ఉన్న నగదును దొంగలు అపహరించారు. స్థానిక సురేష్ మహల్ రోడ్డులో గత రెండు నెలలుగా వివిధ షాపుల్లో నాలుగు దొంగతనాలు జరిగాయి. గత ఆరు నెలలుగా పట్టణంలో నాలుగు లేక ఐదు దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. మార్కాపురం రోడ్డులో జవ్వాజి దానారావు అనే షాపులో వరుసగా మూడు నెలల్లో మూడుసార్లు దొంగతనం పెరగడంతో యజమాని ఆ షాపులోనే పడుకునే పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా పట్నంలోని వివిధ ప్రాంతాల్లో నివాస గహాల్లో కూడా దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. వరుస దొంగతనాలతో వినుకొండ పట్నం లోని చిరు వ్యాపారులు, కిరాణా మెడికల్ వివిధ షాపుల యజమానులతో పాటు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గతంలో మాదిరిగా వినుకొండ పట్టణంలో పోలీసులు దొంగతనాల నియంత్రణ చర్యలు తీసుకోవట్లేదు అనే విమర్శలు విని పిస్తున్నాయి. నైట్ పెట్రోలింగ్, పోలీస్ గస్తీలు లేకపోవటం వలనే దొంగలు బరి తెగించి దొంగతనాల పాల్పడుతున్నారని ప్రజలు అభిప్రాయపడు తున్నారు. పట్టణ పోలీసులు వరుసగా జరుగుతున్న దొంగ తనాలపై ప్రత్యేక దృష్టి సారించి నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అమరావతిలో వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-అమరావతి

అమరావతిలో ఎస్సై షేక్. మహబూబ్ సుభాని వాహనాలు తనిఖీ కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు సరైన పత్రాలు లేకుండా రోడ్లపై తిప్పితే చర్యలు తీసుకుంటామన్నారు. అమరావతిలో చేపట్టిన వాహనాలు తనిఖీ కార్యక్రమంలో వాహనాల రిజిస్ట్రేషన్ , పెండింగ్ లో ఉన్న చలానాలను క్లియర్ చేయాలని.. సరైన ఆధారాలు లేని వాహనాలను స్టేషన్ తరలించడం జరుగుతుందని ఎస్సై తెలిపారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండ ప్రాంత నివాసాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని మూడు ,నాలుగు వార్డులో కొండ ప్రాంతంలో నివాసముంటున్న గహాలను శనివారం సాయంత్రం ఎక్సైజ్ అధికారులు, పట్టణ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. గంజాయిని సరఫరా చేసే పాత నేరస్థులు ఇళ్లను, కొండపై భాగంలో ఉన్న ఖాళీ ప్రదేశాలను తనిఖీలు నిర్వహించారు. అయితే ఎటువంటి గంజాయి దొరకలేదని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కే మణికాంత్ తెలిపారు. గంజాయి అమ్ముతున్నట్లుగా ఎవరైనా ఇక్కడ గమనిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ ఎక్సైజ్ సీఐ ఈ మారయ్య బాబు, ఎస్సై జి మల్లికార్జునరావు, పట్టణ ఎస్ఐ ఈ నారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదార్ల పక్కనే అంత్యక్రియలు

- అమరారెడ్డినగర్ దాటిన తర్వాత రోడ్డు పక్కనే దహనం, ఖననం
- మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్‌లో ఇదీ దుస్థితి
- శ్మశావాటిక ఏర్పాటు కోసం ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి-తాడేపల్లి

పేరుగొప్ప ఊరుదిబ్బ అన్నంటుంది మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిస్థితి వేర్వేరు మునిసిపాలిటీలుగా ఉన్న మంగళగిరి, తాడేపల్లిలను కలిపి మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్‌గా నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంగళగిరి కంటే కూడా తాడేపల్లి విజయవాడ నగరానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పెద్ద ఎత్తున అభివృద్ధి చెందుతోంది. ముఖ్యంగా పట్టణానికి తూర్పు వైపున ఉన్న ప్రాంతంలో అపార్టుమెంట్ల నిర్మాణ సంస్కృతి విపరీతంగా పెరిగింది. 700 ప్లాట్లు ఉన్న గేటెడ్ కమ్యూనిటీ అపార్టు మెంట్ నిర్మాణాలు జరిగాయి. కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లిలోనే సుమారు లక్ష మంది జనాభా నివసిస్తున్నారు. ఇంత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తాడేపల్లిలో శ్మశాన కొరత పట్టి పీడిస్తోంది. మనుషులు చనిపోతే రోడ్డు పక్కన కాల్చివేయడం, గోతులు తీసి పూడ్చిపెట్టడం జరుగుతోంది. ఎంటిఎంసి కార్పొరేషన్‌లో కలిసిన చిన్న చిన్న గ్రామాల్లోనే ఆహ్లాదకరమైన వాతావరణంలో శ్మశానవాటికలు రూపుదిద్దుకున్నాయి. తాడేపల్లిలో మాత్రం అటువంటి అదృష్టానికి ప్రజలు నోచుకోలేదు. గతంలో సిపిఎం అధికారంలో ఉన్న సమయంలో శ్మశాన వాటిక ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగాయ. ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, దళితులకు పెద్ద ఎత్తున అన్యాయం జరుగుతోందంటూ సిపిఎంపై విషప్రచారం చేసి శ్మశానవాటిక నిర్మా ణాన్ని అడ్డుకున్నారు. అప్పటినుండి శ్మశాన వాటిక గురించి పట్టించుకునే నాథుడే కరు వయ్యాడు. ప్రస్తుతం రైతుల పంటపొలాల పక్కన, తాడేపల్లి నుంచి కొలనుకొండ వెళ్లే అమరారెడ్డినగర్ దాటిన తర్వాత రోడ్డు పక్కనే మృతదేహాలను దహనం చేస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన బోరింగ్ పంపు పాడవడంతో కిలో మీటర్ దూరం నడిచి బకింగ్ హామ్ కాలువ దగ్గర ఏర్పాటు చేసిన కర్మల సత్రంలో కాళ్లూ చేతులు శుభ్రం చేసుకోవాల్సి వస్తోంది. ఎంటిఎంసి కార్పొరేషన్‌కు పెద్దఎత్తున ఆదాయం సమకూరుస్తున్న తాడేపల్లికి శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరు తున్నారు.

నిందితుడిని పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని సత్తెనపల్లి రూరల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సత్తెనపల్లి శాస్త్రినగర్ కు చెందిన చిలక చిట్టిబాబు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ నెల 22తేదీన సత్తెనపల్లి మండలం గుడిపూడిలోని ఒక ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలు వెండి వస్తువులతో పాటు సెల్ ఫోను, కొంత నగదును

బంగారు ఆభరణాలు స్వాధీనం

దొంగిలించాడు . బాధితురాలు మోతుకూరి తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రూరల్ పోలీసులు చిట్టి బాబును అరెస్టు చేశారు ఆతని వద్ద నుండి బంగారు ఆభరణాలు వెండి వస్తువుల స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు రూరల్ ఎస్ఐ ఆవుల బాలకృష్ణ తెలిపారు.

ములకలూరులో 'ఇదేమి కర్మ'

ప్రజాశక్తి-నూజెండ్ల

ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని టిడిపి శ్రేణులు శుక్రవారం రాత్రి మండలం లోని ములకలూరులో నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల్ని వివరిస్తూ స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. స్థానికంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని, ఈ విషయమై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని కరెంట్ బిల్లులు భారీగా వస్తున్నాయని, ప్రజలు వాపోయినట్లు టిడిపి నాయకులు తెలిపారు.కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ బచ్చు అంజి రెడ్డి , యూనిట్ ఇన్చార్జి యరబిక్కి వెంకట్రావు, యరబిక్కి కిరణ్ , యరబిక్కి రామాంజనేయులు, బూత్ కన్వీనర్ యరబిక్కి. ఆంజనేయులు, బూత్ కన్వీనర్ బత్తిని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL.SENIOR CIVIL JUDGE::GUNTUR
I.A.No.353/2022 in O.S.No:1/2013

Between:
Movva Sailaja ....Petitioner/Plaintiff
And
Yarava Padmaja & Others ....Respondents/Defendants

To,
R-5/D-5: Panchumarthi Lakshmi, D/o.Vasudeva Rao, R/o.Flat No:1, Sri Padma Nivas Apartment, 2nd lane Vikas Nagar, Guntur.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన పంచుమర్తి వాసుదేవ రావు మరణించినందున ఆయన స్థానే ,ఆయన వారసురాలు అయిన మిమ్ములను 5వ ప్రతివాదిగా చేర్చమని ఐ.ఎ.నెం :353/2022ని దాఖలు చేయగా సదరు పిటీషనులో 5వ రెస్పాండెంట్/ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసు/సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా,సదరు ఆర్డరు ప్రకారము మీరు ది: 01-03-2023న ఉ. గం. 10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపరచటమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:01-03-2023

దివ్వి శ్రీనివాస రావు,
యమ్.అపర్ణ,
పిటీషనరు/ వాది తరపు అడ్వకేట్స్,
గుంటూరు. సెల్: 89777 77377

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్‌జడ్జి నరసరావుపేట వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 408/2017

బిట్వీన్ :
బొగ్గవరపు చెంచుపున్నయ్య వగైరా ... ప్లయింటిఫ్
వర్సెస్
చంద్రా వెంకటసుబ్బమ్మ వగైరాలు ... డిఫెండెంట్స్
నోటీసు
టు
(డి 23) : వల్లూరి లక్ష్మీ ప్రసన్న, భర్త : ఇ.వి. శరత్‌బాబు, హౌస్ నెం. సి/13/6, సి క్యాంప్, మునిసిపల్ వాటర్ ట్యాంక్ ఎదురు, కర్నూలు-518001.
(డి 24) : కాపు సరస్వతి, భర్త : సాంబశివరావు, డోర్ నెం. 4-29, పండరీపురం, చిలకలూరిపేట టౌన్ మరియు మండలం, పల్నాడుజిల్లా.
(డి 25) : కాపు విశ్వనాథం, తండ్రి : సాంబశివరావు, డోర్ నెం. 4-29, పండరీపురం, చిలకలూరిపేట టౌన్ మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు గల దావాలో మీకు శ్రీ కోర్టువారు పేపరు నోటీసు నిమిత్తమై ఆర్డరు వేసియున్నారు. సదరు దావా మీకు నోటీసు నిమిత్తమై ది. 06-03-2023వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు తేదీన మీరు ఉదయం 10 గంటలకు హాజరై మీ వాదన ఏమైనా వుంటే శ్రీ కోర్టువారి ఎదుట తెలియ జేసుకొనగలరు. సదరు ది. 06-03-2023న మీరు స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై శ్రీ కోర్టువారికి మీ వాదనలు తెలుపగలరు. లేని యెడల సదరు కేసును మీ పరోక్షమున శ్రీ కోర్టువారు తీర్మానించగలరని ఇందుమూలముగా తెలియజేయటమైనది.

వాయిదా : 06-02-2023

ఇట్లు
స్థలం:చిలకలూరిపేట **ఎస్.సుధాకరరెడ్డి,**
తేది: 25-02-2023 **అడ్వకేట్,**
శివాలయం ఎదురు, చౌత్రా సెంటర్,
చిలకలూరిపేట. సెల్ : 9490897827.

NOTICE
IN THE COURT OF THE HON'BLE I ADDL. DIST. JUDGE:: GUNTUR
M.V.O.P.NO: 354 / 2021

Between:
Rayala Venkayamma ... Petitioner
And
Mani Kumar Mallisetty and Others ... Respondents

To,
R-1: Mani Kumar Mallisetty, S/o.Prasad, R/o. Sivalayam Street, Pedakakani (Vil &Md), Guntur Dist., (Owner Of the AUTO Bearing No:AP07 TC 6619)(As per R.C)
R-2: Surabhi, W/o.Subba Rao, R/o.Door No:6-63, Yenamadala(V), Prathipadu (Md), Guntur Dist., (Owner Of the AUTO Bearing No:AP07 TC 6619)(As per Policy)
R-4: Turaka Devadasu, S/o.Krishna Rao, R/o. 8 th Line, Putchalapalli sundaraiah Colony, J.K.C.Road, Adavi takkella padu, Guntur (Rural Md,&City&Dist.) (Driver Of the AUTO Bearing No:AP07 TC 6619)

పై నెంబరు O.P లో పిటీషనర్ యాక్సిడెంట్ కు నష్టపరిహారము కోరుచూ పిటీషన్ దాఖలు చేయగా సదరు O.P లో 1, 2 & 4వ రెస్పాండెంట్స్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది: 15-03-2023 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:15-03-2023

చుక్కపల్లి రమేష్,
పిటీషనరు తరపు అడ్వకేట్,
గుంటూరు.

వృద్ధులతో మాట్లాడుతున్న జడ్జి డి.నాగవెంకటలక్ష్మి

మీరే వచ్చారా..? కుటుంబీకులు తెచ్చారా?

ప్రజాశక్తి-సత్తెనపల్లిటౌన్

స్థానిక ఆదరణ వృద్ధుల ఆశ్రమాన్ని మండల న్యాయసేవాధికార కమిటి చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి డి.నాగవేంకటలక్ష్మి శనివారం సందర్శించారు. ఇక్కడ ఎంతమంది వృద్ధులు వుంటున్నారు, వారికి అందిస్తున్న ఆహారం, ఇక్కడి వృద్ధులకు సంతానం వున్నారా లేదా? ఉంటే కనుక వారు ఏం చేస్తుంటారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. 'మీకు మీరుగా వచ్చారా? లేక కుటుంబ సభ్యులు తెచ్చారా..?' అని వృద్ధులను ఆమె అడిగారు. వారికి అవసరమైతే ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని జడ్జి చెప్పారు. అనంతరం అక్కడ వున్న రిజిస్టర్‌ను పరిశీలించి, నిర్వహణ కమిటీ వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆకస్మికంగా సందర్శనలో ప్యానల్ న్యాయ వాదులు డి.శ్రీనివాస్ ,బి.ఎల్.లక్ష్మీ కోటేశ్వరరావు ఉన్నారు.

ధరణికోటలో నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-అమరావతి

మండల పరిధిలోని ధరణికోట జైల్ సింగ్ కాలనీ లోని లూథరన్ చర్చి లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ వడ్లమూడి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈ వైద్య శిబిరంలో బిపి, షుగర్, కాళ్ల నొప్పులు, థైరాయిడ్ మొదలగు అన్ని రకాల వ్యాధులకు ఉచిత వైద్యం అందిస్తామని అన్నారు. వట్టికుంట చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వట్టికుంట శేషగిరిరావు ఆధ్వర్యంలో ఉచితంగా మందుల పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా శ్రీనివాసరావు కోరారు.

మిర్చి సాగులో మెలకువలపై అవగాహన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండలంలోని జూలకల్లు రైతు భరోసా కేంద్రంలో రైతులకు డ్రిప్ పద్ధతి, మిరప సాగులో మెళకువల గురించి సమగ్ర సస్య రక్షణా గురించి రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు వివరంగా తెలియజేశారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా పిడుగురాళ్ల మండలం ఉద్యాన అధికారి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రిప్ పద్ధతి ద్వారా మందు పెట్టే పద్ధతిని రైతులకు వివరించారు. ఈ పద్ధతి ద్వారా ఎరువుల మోతాదు తగ్గించుకోవచ్చని, అలాగే కలుపు సమస్యను తగ్గించుకోవచ్చని చెప్పారు. మిరప నారును నర్సరీలో మాత్రమే వేసుకోవాలని బయట ఓపెన్ బెడ్స్ కింద వేసుకోకూడదని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు షేక్ దస్తగిరి, కేఎల్ యూనివర్సిటీ సిబ్బంది జెఆర్‌ఆఫ్ వైశాలి, ఇంజినీర్ అశ్వకు, ఖాజా మొహిద్దిన్, అనుసాగర్, మణికంఠ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

చాప కింద నీరులా ప్రాణాంతక వ్యాధి

- చిలకలూరిపేటలో పెరుగుతున్న ఎయిడ్స్ బాధితులు
- తగ్గుతున్న సర్వీస్ సొసైటీల సహకారం
- పింఛను అందక రోగులు విలవిల

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేట నియోజకవర్గంలో చాపకింద నీరులా హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాపిస్తోంది. ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించకపోవడం, దాని నియంత్రణకు తగిన చర్యలు చేపట్టకపోవడం వల్లే ఇది విస్తరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నియోజకవర్గంలో 2016 లో ఎయిడ్స్/ హెచ్ఐవి రోగుల సంఖ్య 764 మంది. ప్రస్తుతం ఆ సంఖ్య 2,275 మందికి చేరినట్లు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఎయిడ్స్ విభాగం వారి లెక్కలు చెబుతున్నాయి. నియోజకవర్గ స్థాయిలో 2020 జనవరి నుంచి డిసెంబర్ వరకు పెరిగిన రోగుల సంఖ్య 108, 2021లో 124, 2022లో 136 , 2023 జనవరి నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షల్లో 32 మంది ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. చిలకలూరిపేట పట్టణంలో 2016లో 100 మంది ఎయిడ్స్/ హెచ్ఐవి రోగులు వున్నారు. పట్టణంలో, నియోజకవర్గంలో ఎక్కడా కూడా ఈ రోగులకు సరైన సౌకర్యాలు లేవు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అప్పట్లో గుంటూరు, నరసరావపేటలో ఎయిడ్స్ రోగులకు మందులు, పౌష్టికాహారాన్ని సరఫరా చేసేవారు. అయితే, రోగుల సంఖ్య ఎక్కువ కావడంతో 2016 మే లో 764 మందిని చిలకలూరిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక విభాగం ఏర్పాటు చేసి, మూడు మండలాలు చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల వారికి నియోజకవర్గస్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు, తదితర పరీక్షలను ఇక్కడే నిర్వహించేవారు.నెలకు గాని, మూడు నెలకు గాని అవసరం అనుకుంటే మధ్యలో గాని ప్రత్యేక పరీక్షలు నిర్వహించి వాటికి తగిన విధంగా మందులను మార్చాల్సి ఉంటుందని, రోగగ్రస్తులకు బల వర్ధకమైన ఆహారం తీసుకోవాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అయితే, ఆర్థిక పరిస్థితులు, వారికి తగిన ఆదరణ లేక పౌష్టికాహారం తీసుకో లేకపోవడంతో ఈ వ్యాధి ఉద్ధృతి శరీరంలో పెరుగుతుందని చెబుతున్నారు. ఈ వ్యాధిని అరికట్టే నిమిత్తం ప్రజలకు అవగాహనా కల్పించే కార్యక్రమాలు గత ప్రభుత్వం హయాంలో బాగా ఉండేవని, ప్రసుత్త ప్రభుత్వం వాటిని అటకెక్కించిందని విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పట్లో పింఛన్లు, పౌష్టికాహారాన్ని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, దాతలు వారికి అందించేవారు. అయితే, గత మూడేళ్లుగా తమకు పింఛన్ రావడం లేదని కొంత మంది వ్యాధిగ్రస్తులు (ఎయిడ్స్/హెచ్ఐవి) వాపోతున్నారు. ఎయిడ్స్ నిర్మూలనకు గత ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొని వాటి కోసం ప్రత్యేక నిధులను కేటాయించి, వ్యాధి నిర్మూలనకు ప్రచారాలు, నియంత్రణకు అవసరమైన మందులు, కండోమ్సను ఉచితంగా అందజేసింది. వాలంటీర్లను ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందజేస్తూ తమకు ప్రత్యేక పింఛన్ కింద నెలకు వెయ్యి రూపాయలను కూడా మంజూరు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అందడం లేదని వ్యాధిగ్రస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

మందులూ సరిగా ఇవ్వడం లేదు

ప్రస్తుత ప్రభుత్వంలో ఎయిడ్స్, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా ఇస్తున్న పింఛన్ నిలుపుదల చేయడం అన్యాయమని సిఐటియు మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతు సరైన మందులను సరైన సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఇవ్వడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వారికి ప్రత్యేక పింఛన్, బల వర్ధకమైన ఆహారం ఇవ్వాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించాలని, గత ప్రభుత్వంలో లాగానే ఎయిడ్స్, హెచ్ఐవి నివారణకు ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు.

ప్రత్యేక పింఛను లేదు

ఒక ఎయిడ్స్ రోగి మాటల్లో.... తమకు ప్రత్యేక పింఛన్ ఏమీ ఇవ్వడం లేదని చెప్పాడు.గత ప్రభుత్వం హయాంలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి, వికలాంగుల పింఛన్లతో పాటు వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పింఛన్ ఇచ్చేవారని ప్రస్తుతం ఆ సౌకర్యం లేదని వాపోయాడు.

మాకు సంబంధం లేదు

ప్రభుత్వ ఆసుపత్రిలోని హెచ్ఐవి/ఎయిడ్స్ నియంత్రణ విభాగానికి చెందిన డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ హెచ్ఐవి/ ఎయిడ్స్ రోగులకు గతంలో ప్రభుత్వం ప్రతి నెలా రూ. 1,000 ఇచ్చేదని ప్రస్తుతం వారికి వస్తుందా లేదా అనేది తమకు సంబంధం లేని విషయమన్నారు. రోగికి ఎయిడ్స్ నిర్ధారణ అయిన తర్వాత వారికి ఒక నెంబర్‌ను కేటాయిస్తామని చెప్పారు. ఆ నెంబరును, రోగి యొక్క ఆధార్ కార్డును కలిపి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ(ఎపిసాస్)కు పంపుతామన్నారు. అక్కడ నుంచి వీరికి పెన్షన్ ఇతర సౌకర్యాలు వస్తాయన్నారు.

బాధిత చిన్నారులకు వసతి సౌకర్యం కల్పించండి

చిలకలూరిపేట పట్టణంలో సుమారుగా 12 వందల మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులుఉన్నారని రోషిని సర్వీసింగ్ సొసైటీ తెలిపింది. ప్రస్తుతం చిలకలూరి పేట నియోజకవర్గ పరిధిలో ఈవ్యాధి సోకిన చిన్నారులు, తల్లిదండ్రులను కోల్పోయి ఈ వ్యాధితో బాధపడుతున్న వారు 45 మంది వరకు వున్నట్లుగా చెప్పారు. దాతల సహాయంతో పౌష్టికాహారాన్ని, ఈ వ్యాధి కారణంగా రోగి శరీరంలో వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ రాకుండా, ఒకవేళ వస్తే పెరగకుండా ఉండే నిమిత్తం మందులను వారికి అందజేస్తున్నట్లు చెప్పారు. వ్యాధి సోకిన చిన్నారులు ఉండేందుకు వసతి సౌకర్యం లేదని ప్రభుత్వం చొరవచూపి ఆ సౌకర్యం కల్పించాలని నిర్వాహకులు ఎ.రమణ విజ్ఞప్తి చేశారు.

జాబ్ మేళాలో 118 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్థానిక అగ్రికల్చరల్ మార్కెట్ యార్డులో శనివారం మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా పిడి డిఆర్‌డిఎ బాలు నాయక్, జిల్లా ఇన్‌ఛార్జి ఉపాధి అధికారి ఎస్.పద్మ హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడప్, సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి, ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 కంపెనీలు హాజరై నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారని. మొత్తం 963 ఉద్యోగాలకు అవకాశం ఉండగా సుమారు 364 మంది హాజరయ్యారని, వీరిలో 118 మంది అర్హత సాధించినట్లు వివరించారు. వీరికి నియామక పత్రాలు అందిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. ప్రణయ్ తెలిపారు. జిల్లా అదనపు నైపుణ్యాభి వృద్ధి అధికారి రామాంజనేయులు, ప్లేస్‌మెంట్ అధికారి రవీంద్ర నాయక్, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి-ఈపూరు

వార్షికోత్సవంలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

చదువుతూనే మంచి భవిష్యత్తు సాధ్యమని తహశీల్దార్ ఆర్.వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు మోడల్ స్కూల్‌లో శనివారం 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ చదువులో రాణించినవారు ఏదైనా సాధించగలరని, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. ఎంపిడిఒ ఎ. ఉషా కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలను ఉచితంగా అందజేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.చెంచయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి .శ్రీనివాసరావు,హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్.గోవింద రాజులు, పిఎంసి చైర్మన్ కె.పున్నయ్య,వైస్ చైర్మన్ కె.కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు సైన్స్‌ఫెస్ట్

ప్రజాశక్తి-నరసరావుపేట

చిన్న వయసులోనే వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయని లిటిల్ జెమ్స్ పాఠశాల చైర్మన్ లింగ అనంతరామయ్య అన్నారు. ఈ నెల 28 న ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్ట్ పురస్కరించుకొని స్థానిక రెడ్డినగర్‌లో లిటిల్ జెమ్స్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ దీప్తి తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్లో చదువుతున్న 150 మంది విద్యార్థులు ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారన్నారు. విద్యార్థులు చదువుకున్న అంశాలను ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శించినట్లు చెప్పారు. ఆయా ప్రాజెక్టుల ఆవశ్యకతను, ప్రాముఖ్యతను వివరించటం అందరిని ఆకట్టుకుందన్నారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌కి చిన్నారుల తల్లి దండ్రులు పాల్గొని సైన్స్ ఎగ్జిబిషన్ తిలకించారు. చిన్నారుల ప్రాజెక్టుల ప్రదర్శనపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఏర్పాటుతో మరిన్ని ఆవిష్కరణలకు దోహదపడతాయన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న కేంద్ర సహాయ మంత్రి

హిందూ ఫార్మసీలో ముగిసిన స్పోర్ట్స్‌మీట్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసి కళాశాలలో రెండ్రోజులపాటు నిర్వహించిన సోర్ట్సమీట్ -2023 శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో కేంద్ర ఆర్యోగ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ హాజరై చెస్, క్యారమ్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.కబడ్డీ, త్రో బాల్, వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు బహుమతి ప్రదానం చేశారు. పోటీలలో ఓవరాల్ ఛాంపియన్షిప్ హిందూ ఫార్మసీ కళాశాలకు దక్కింది, విజ్ఞాన్ ఫార్మసీకాలేజీ రన్నర్‌గా నిలిచారు. అనంతరం ఫిజికల్ డైరెక్టర్ లెఫ్టినెంట్ సి.హెచ్.అజిత్ బాబు స్పోర్ట్స్ మీట్‌కు సంబంధించిన రిపోర్ట్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ముఖ్య అతిథి కేంద్ర మంత్రిని, న్యాయనిర్ణేతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కొండ రవికుమార్, ఫార్మా.డి. డైరెక్టర్ డాక్టర్ పి. సీతా రామయ్య అధ్యాపకులు, విద్యార్థులు ,తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఎన్.వెంకటరామ్

కెఎల్‌యు సాంకేతిక ఫెస్ట్ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్‌టు బి విశ్వవిద్యాలయంలో ఈ నెల 28 నుండి మార్చి 1వ తేదీల వరకు వరుస సదస్సులు జరగనున్నట్లు విశ్వవిద్యాలయం ప్రో వైస్ చాన్సులర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్ అన్నారు. శనివారం నాడు ఇసిఇ విభాగ అధిపతితో కలిసి ఆయన ఫోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసిఇ విభాగం వారు నిర్వహించే ఫెస్ట్ జ్రోత్రియా అని తెలిపారు. ఈ కార్యక్రమానికి వడ్డేశ్వరంలోని వర్సిటీ విద్యార్థుల తో పాటు హైదరాబాదులో ఉన్న కెఎల్ వర్శిటీ విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గంటారని అన్నారు. విభాగ అదిపతి డా.సుమన్ మలోజీ మాట్లాడుతూ కెఎల్ విశ్వవిద్యాలయం ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం పెంచడంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం జరుగుతుందన్నారు. రెండు రోజుల్లో వివిధ టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్యక్రమాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. రెండు మెగా సాంకేతిక కార్యక్రమాలతో ఫెస్ట్ అత్యాధునిక సాంకేతికతను సంతరించుకోనుందన్నారు. జ్రోత్రియాలో నాన్-టెక్నికల్ కార్యక్రమాలు కూడా ఉన్నాయన్నారు. తరగతి గదులలో విరామం లేని మూల్యాంకనం విద్యావేత్తల పాఠాల నుండి విద్యార్థులకు కొంత విరామం ఇస్తాయని అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్ డాక్టర్ ఎన్.వెంకట రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్ , పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ శ్రీ కావ్య, జ్రోత్రియాలో కన్వీనర్ శ్రీకాంత్, అద్యాపకులు వి.సాహితి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకిష్టమైన విభాగాల్లో రాణించనివ్వండి

ప్రజాశక్తి-తాడేపల్లి

తల్లి దండ్రులు విద్యార్థులకిష్టమైన భాగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల పిజిక్స్ విభాగం ప్రొఫెసర్, ప్రజా సైన్సు ప్రచారకులు ప్రొఫెసర్ తుమ్మల శ్రీకుమార్ కోరారు. తాడేపల్లి పట్టణంలోని సుందరయ్య నగర్ ప్రగతి హైస్కూల్ 34వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు హైస్కూల్ కరస్పాండెంట్ పి.గిరిజ అధ్యక్ష వహించారు. ప్రొఫెసర్ శ్రీకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవస్థలో దేశానికి బలమైన వ్యక్తులు కావాలని, అందుకు ప్రగతి శీల విద్యాలయాలతో పాటు తల్లిదండ్రులు కూడా సహకారం అందించాలని కోరారు. అప్పుడే దేశంలో దేశ భక్తులు తయారవుతారని చెప్పారు. ఐఐటి, ఐఎఎం,లు చదువుకోని విదేశాలకు వెళ్లడం కాదని ఈ దేశ ప్రజలకు సేవ చేయాలని కోరారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక సృజనాత్మకత దాగి ఉంటుందని, దానిని గుర్తించి పిల్లలను ప్రోత్సహిచాలని కోరారు. ఆడిపిల్ల చదువు సమాజానికి మేలు చేస్తుందని చెప్పారు. రాబోయే 10 ఏళ్లలో కృత్రిమ మేధా రాబోతుందని వెల్లడించారు. దీంతో ఉద్యోగాలు కోల్పోయే అవకాశాలు ఉన్నాయని, మానవ మనుగడకు ఇది ఇబ్బందికరమని చెప్పారు. ఐఐటి లాంటి కోర్సులు చదవాలంటే ప్రభుత్వం రూ.5లక్షలు వసూల్ చేస్తుందని, విద్యార్థులందరూ ఇంత పెద్ద ఎత్తున ఫీజులు కట్టి చదువుకోగలరా అని ప్రశ్నించారు. ఇంగ్లీష్ విద్య ఒక్కటే ప్రాముఖ్యం కాదని మాతృభాషతోపాటు గణితం కూడా చాలా ముఖ్యం అని సూచించారు. ప్రభుత్వ విద్యను దూరం చేయడానికే నూతన విద్యను ప్రవేశపెట్టిందని విమర్శించారు. విద్యార్థుల్లో బుక్ రీడ్ తగ్గి లుక్ రీడ్ పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠ్యపుస్తకాలతో పాటు చరిత్రకు సంబంధించిన పుస్తకాలు చదివి పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. లక్కిరెడ్డి బాలరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ బొరుగ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సమాజాన్ని కూడా అధ్యాయనం చేయాలని కోరారు. సభలో ప్రగతి హైస్కూల్ ప్రిన్సిపల్ వై. వెంకట రత్నం (నాని) పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

మాట్లాడుతున్న ప్రొఫెసర్ తుమ్మల శ్రీ కుమార్

సాంకేతిక ప్రక్రియల మెరుగుదలకు సిక్స్ సిగ్మా దోహదం

కెఎల్‌యును సందర్శించిన జగోరా విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఆఫ్రికాలోని జగోరా విశ్వవిద్యాలయం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మహమౌద సలౌహా శనివారం కెఎల్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. కెఎల్‌యులోని ఎంబిఎ కళాశాల నిర్వహించిన ఒకరోజు అద్యాపకుల వర్క్ షాప్‌లో భాగంగా సిక్స్ సిగ్మా అనే అంశం పై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన లీన్ మరియు సిక్స్ సిగ్మాపై విలువైన సమాచారాన్ని అందించారు. సంస్థలు సజావుగా సాగేందుకు దీన్ని ఎక్కడ ఎలా ఉపయోగించాలి అనే కోణాల గురించి చర్చించారు. సిక్స్ సిగ్మా అనేది ప్రక్రియ మెరుగుదల కోసం సాంకేతికతలు మరియు సాధనాల సమితి అని , దీనిని 1986లో మోటరోలా అనే ప్యాక్టరీలో పనిచేస్తున్నప్పుడు అమెరికన్ ఇంజనీర్ బిల్ స్మిత్ ప్రవేశపెట్టారని వివరించారు. సిక్స్ సిగ్మా వ్యూహాలు, లోపాల కారణాలను గుర్తించడం, తొలగించడం ద్వారా తయారీ నాణ్యతను మెరుగుపరచవచ్చునని అన్నారు. సిక్స్ సిగ్మా అనే పదం తయారీ ప్రక్రియల గణాంక నమూనా నుండి ఉద్భవించిందని ఆయన అన్నారు. అనంతరం డాక్టర్ మహమౌద సలౌహాను కెఎల్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబులు విసి చాంబర్‌లో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఎం.హెచ్ ఎస్. డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, ఎంబిఎ విభాగ అధిపతి డాక్టర్ హేమదివ్య ,అద్యాపకులు సిహెచ్ బాలాజి, జగోరా విశ్వవిద్యాలయం సహ వ్యవస్థాపకుడు యౌండే కామెరూన్ తదితరులు పాల్గొన్నారు.

మహమౌద సలౌహౌను సత్కరిస్తున్న జి. పార్ధసారధి వర్మ

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కిట్స్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు:వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో హెల్ప్ ఫౌండేషన్, కామాక్షి ఐకేర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన కళాశాల కార్యదర్శి కోయ శేఖర్ మాట్లాడుతూ యువత సామాజిక మాధ్యమాలపై అధిక సమయం గడపటం వల్ల కంటి సమస్యలు ఎక్కువయ్యాయని చెప్పారు. ల్యాప్‌టాప్, ఫోన్‌లకు విపరీతంగా అలవాటు పడటం వల్ల కంటి సమస్యలు అందర్నీ ఇబ్బంది పెడుతున్నాయన్నారు. వైద్యులు వాసుదేవరావు మాట్లాడుతూ సాధారణంగా చాలా మంది దృష్టి లోపాలున్నా చిన్న సమస్యే కదా అని దాని పట్ల శ్రద్ధ వహించ కుండా వదిలేస్తూ ఉంటారని, ప్రతి ఒక్కరూ కంటి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, కాలేజి ఎన్ఎస్ఎస్ వింగ్ చంద్రారెడ్డి, హాస్పిటల్ సిబ్బంది వనిత, సదాశివరావు, బాబ్జి పాల్గొన్నారు.

పురస్కారం అందచేస్తున్న బండి అశోక్‌రెడ్డి, తదితరులు

సూర్యనారాయణకు 'గ్రంథాలయ బ్రహ్మ' పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు:పుస్తకాల సేకరణే శ్వాసగా, ధ్యాసగా, జీవితాన్ని మలుచుకొని అన్నమయ్య గ్రంథాలయ స్థాపనలో తనదైన పాత్ర పోషించిన లంకా సూర్యనారాయణకు బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ 'గ్రంథాలయ బ్రహ్మ' పురస్కారాన్ని గుంటూరు పశ్చిమ తహశీల్దార్ టి.శ్రీనివాసరెడ్డి చేతులమీదుగా అందచేశారు. శనివారం స్థానిక బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సూర్యనారాయణ ఉద్యోగ విరమణ అనంతరం పుస్తకాలపై ప్రేమతో లక్షన్నర పుస్తకాలను సేకరించి, వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి అందచేశారన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ, కాశీపట్నం సుబ్బారావు, లైబ్రేరియన్ సుభాషిణి, పాఠకులు, పుస్తక ప్రియులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ శతాబ్ధి రంగస్థల పురస్కారాలు ప్రదానం

జిఎస్ఆర్‌కే శాస్త్రి, విజయలక్ష్మీని సత్కరిస్తున్న ఆలపాటి తదితరులు

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక ఎన్జీవో కల్యాణ మండపంలో శనివారం రాత్రి ఆలపాటి అధ్యక్షతన ఎన్టీఆర్ శతాబ్ది రంగస్థల పురస్కారాలను అందించారు. గుంటూరుకు చెందిన ప్రఖ్యాత రంగస్థల నటులు జిఎస్ఆర్‌కే శాస్త్రి, రాజమండ్రికి చెందిన అమ్మన విజయలక్ష్మిలకు పురస్కారాలను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ నాటక రచియిత కందిమళ్ళ సాంబశివరావు, ప్రముఖ సినీ, రంగస్థల నటులు నాయుడు గోపి ముఖ్యవక్తలుగా పాల్గొని మాట్లాడుతూ ఎన్టీఆర్ నటనా వైభవానికి అద్దం పట్టేలా ఉత్సవాలు నిర్వహస్తున్నారని కొని యాడారు. పురస్కార గ్రహీతలు జిఎస్ఆర్‌కె శాస్త్రి, విజయలక్ష్మి మాట్లాడుతూ కళారంగానికి ఉత్సవాలు ఎంతో ఊతం ఇస్తున్నాయన్నారు. ముఖ్యంగా ఎంతో వైవిధ్య భరితమైన నటులు, కోట్లాది మంది అభిమానులను కూడగట్టుకున్న రాజీకీయ వేత్త ఎన్టీఆర్ స్మారకంగా పురస్కారాలు అందుకోవటం ఎంతో సంతోషంగా ఉందన్నారు.డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, కనపాల రవిబాబులు పాల్గొన్నారు.

17 నుంచి విజ్ఞాన్ 'సృజనాంకుర-2కే23'

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో విజ్ఞాన్ యూనివర్సిటీ జాతీయస్థాయి సృజనాంకుర ఆవిష్కరణలను మార్చి 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. శనివారం వర్సిటీలో విజ్ఞాన్ సజనాంకుర-2కె23 పోస్టర్లను ఆవిష్కరించారు. సృజనాంకురకు ముఖ్య అతిథిగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఇన్నోవేటర్ సుధాన్షు మణి హాజరుకానున్నారని వెల్లడించారు. అలాగే భారీస్థాయిలో శాస్త్ర, సాంకేతిక వైజ్ఞానిక ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. అంతర్జాతీయస్థాయి నైపుణ్యం, నాణ్యతతో కూడిన వేలాది ప్రయోగ నమూనాలను విద్యార్థులు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. విజ్ఞాన్ సృజనాంకుర 2కే23లో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల నుంచి 15వేల మంది విద్యార్థులు తరలి వస్తారని, రూ.9 లక్షల విలువైన నగదు బహుమతులను విజ్ఞాన్ సృజనాంకురలో విజేతలకు అందజేస్తామని తెలిపారు. మొత్తం 9 కేటగిరీల్లో పోటీలు జరుగుతున్నాయని, రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని చెప్పారు. పోస్టర్ ఆవిష్కరణలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ

రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బెల్లంకొండ

బెల్లంకొండ మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గడచిన సంవత్సర కాలంలో వివిధ రకాల అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు.పది గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ బృందం పర్యటించి గడిచిన ఏడాది కాలంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం 14 వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో అక్కడక్కడ మేట్ లు, మష్టర్సులో చిన్న చిన్న తేడాలు, పేర్లు దిద్దుబాటు చేయటం, మొక్కల పెంపకం ఆశాజనకంగా లేదని పిడి జోసెఫ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి,బాబూరావు ,ఎంపీపీ చిన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వర్ రెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్ లు ,తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కలిసి పని చేయండి

ప్రజాశక్తి- పెదకూరపాడు

మండల అభివృద్ధికి, ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలని పెదకూరపాడు ఎంపిపి బెల్లంకొండ మీరయ్య అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మండలం అభివృద్ధిలో కొనసాగుతోం దన్నారు. మరింతగా అభివృద్ధి చెంద డానికి అందరూ కలిస కట్టుగా రావాలన్నారు. వివిధ శాఖల అధికారులు ప్రస్తుతం జరుగుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ క్షమారాణి, ఎండిఒ నరసింహారావు, ఇతర అధికారులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

విద్య ఉన్నత స్థాయికి చేరుస్తుంది

ప్రజాశక్తి-పెదకూరపాడు

విద్య ఉన్నత స్థాయికి చేరుస్తుందని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కేవీ సుబ్బారావు అన్నారు. శనివారం 85- 86 సంవత్సరపు 10వ తరగతి పూర్వ విద్యార్థులు, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరాంజనేయులు ఆధ్వర్యంలో జరిగింది.

'సుధాకర్ చౌదరిని అరెస్టు చేయండి'

ప్రజాశక్తి-నరసరావుపేట

మంగళగిరి మండలం చిన్నకాకాని గ్రామ పంచాయతీ పరిధిలో దళితుడు గొల్ల ప్రసాద్ కు చెందిన 6 ఎకరాలు భూమిని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు బినామీ వల్లభనేని సుధాకర్ చౌదరి ,బద్దిరెడ్డి వెంకటరెడ్డిలు కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని దళితులకు అన్యాయం జరిగితే దళిత సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్, మాలమహానాడు ఆగ్రహం వ్యక్తం చేసింది.. ఈ సందర్భంగా సమతా సైనిక్ దళ్ నాయకులు జంగం బాజి మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజును గొల్ల ప్రసాద్ ను ఇంటికి పిలిపించి 6 ఎకరాలకు రూ.5 కోట్లు ఇస్తామని భూమిని వదిలేయాలని ఒత్తిడి చేస్తూ కేంద్రం లో అధికారం ఉందని, వైసిపి తమకు అనుకూలంగా ఉంటుందని నిర్ణయించిన ధరకు విక్రయించాలని బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. బిజెపి పెద్దలు దళితుల భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బిజెపి నుండి సోము వీర్రాజును సస్పెండ్ చేయాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా దళిత సంఘాలు ఉద్యమం చేస్తారని రాష్ట్ర ప్రభుత్వం దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పేదల పక్షాన నిలవాలి

ప్రజాశక్తి-బెల్లంకొండ

గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పేదల పక్షాన నిలవాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లకు శిక్షణా కార్య క్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రానున్న ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులే వైసిపి విజయసారథులని అన్నారు. కొత్తగా నియమించిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో పాటు కార్పొరేటర్లు, వాలంటీర్లందరితో డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేయాలన్నారు. ఇందుకోసం వారికి ప్రత్యేక కిట్లు అందించనున్నట్లు చెప్పారు. ఈ కిట్‌లో గృహ సారథులు ధరించడానికి ప్రత్యేక బ్యాడ్జ్‌లు, ప్రజామద్దతు పుస్తకాలు, కరపత్రాలు, మొబైల్ స్టిక్కర్లు, డోర్ స్టిక్కర్లు ఉంటాయన్నారు. డోర్ టు డోర్ క్యాంపెయిన్‌లో ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ కీలకమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల ఎంపిపి పద్మ వెంకటేశ్వర్ రెడ్డి, చింతరెడ్డి సాయిరెడ్డి, మండల కన్వీనర్ ఓర్చు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేటలో 'గడపగడపకూ'

ప్రజాశక్తి-అచ్చంపేట

ప్రతి కుటుంబానికి సంక్షేమ తోడ్పాటు అందిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. అచ్చంపేటలో గడపగడప కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల కరపత్రాలు ప్రజలకు ఇచ్చి.. ప్రభుత్వ లబ్దిని వివరించారు. ఏవైనా సమస్యలుంటే తన దష్టికి తేవాలని సూచించారు. అపరిష్కతంగా ఉన్న సమస్యలు పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.

అచ్చంపేటలో రూ.1.5 కోట్లతో అన్ని సౌకర్యలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించామన్నారు. కేజీబీవీ, జిల్లా పరిషత్ స్కూల్, రెసిడెన్షియల్ స్కూళ్ల అభివద్ధికి రూ.5.30 కోట్లకు పైగా ఖర్చు చేశామన్నారు. నాడు-నేడు ద్వారా రూ.2.90 కోట్లతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. ఇవి కాక, రెండు సచివాలయ భవనాలు, కమ్యూనిటీ హాల్, వెల్ నెస్ సెంటర్లు నిర్మిస్తున్నామని చెప్పారు. అచ్చంపేట మండలంలో సత్తెమ్మ తల్లి ఆలయ అభివద్ధికి అటవీ శాఖ అనుమతులు తెచ్చి పనులు జరిపిస్తున్నామన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా కృష్ణానదిపై రూ.60 కోట్లతో బ్రిడ్జిని నిర్మించబోతున్నట్లు చెప్పారు.

'వరికపూడిసెల'నిర్మాణాన్ని ప్రారంభించండి

ప్రజాశక్తి-మాచర్ల : మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల రైతాంగానికి సాగునీరు, అనేక గ్రామాలకు త్రాగునీరు అందించే వరికపూడిశెల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని పల్నాడు జిల్లా సిపిఐ కార్యదర్శి మారుతి వరప్రసాదరావు డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి మండల పరిధిలో క్రిష్ణానదిపై ఏర్పాటు చేయవలసిన వరికపూడిశెల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను శనివారం సిపిఐ పల్నాడు జిల్లా నాయకత్వ బృందం సందర్శించారు. ప్రాజెక్ట్ నిర్మాణం చేయు స్థలం వద్ద నిరసన తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసించారు. ప్రాజెక్ట్ నిర్మాణం చేయు స్థలం వద్ద నిరసన తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసించారు.

జగనన్న ఇళ్లకు రూ.5 లక్షలివ్వాలి

ప్రజాశక్తి-వినుకొండ: జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు ఐదు లక్షలు ఇవ్వాలని, టిడ్కో గృహాలను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 2 వ తేదీన సిపిఐ ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాను విజ యవంతం చేయాలని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ లబ్ధిదారులను కోరారు. శనివారం నాడు సిపిఐ విను కొండ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక 8వవార్డులో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తత ప్రచారం చేశారు. ప్రభుత్వం ఇచ్చే నిధులు పునాదులకు సరి పోవడం లేదని అన్నారు.

'ఓటమి భయంతోనే వివాదాలు'

ప్రజాశక్తి-నరసరావుపేట: రాష్ట్ర పోలీస్ శాఖ వైసిపి నాయకులకు ప్రైవేట్ సైన్యంలా వ్యవహరిస్తోందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు విమర్శించారు. మాచర్ల నియోజకవర్గం మిర్యాలలో మాచర్ల టిడిపి ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డిని ఊరేగించిన ట్రాక్టర్‌ను తగలబెట్టిన ఘటనను ఆయన ఖండించారు. ప్రశాంతమైన పల్నాడు పల్లెల్లో ఫ్యాక్షనిజాన్ని ప్రోత్సహిస్తూ టీడీపీ కార్యకర్తల పై పొలిటికల్ టెర్రరిజానికి పాల్పడుతోందని ఘాటు వ్యాఖ్యలు చేశారు.. పల్నాడులో బలపడుతున్న ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలను హత్య చేయించడం ,ఆస్తులను విధ్వంసం చేయడం వంటి పొలిటికల్ టెర్రరిజంతో భయం సృష్టించి గెల వాలని పల్నాడు వైసిపి నాయకులు పని చేయ డం దుర్మార్గమన్నారు. పల్నాడు వైసిపి నాయ కులకు పోలీసులు ప్రైవేట్ సైన్యంలా పని చేస్తు న్నారని, పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రొంపిచర్ల మండల పార్టీ అధ్యక్షుడు వెన్నా బాలకోటి రెడ్డి మృతదేహాన్ని చూసేందుకు వెళ్లిన టిటిపి కార్యకర్తల పైనా, తనపైన కేసులు పెట్టిన పోలీసులు, మిర్యాలలో ట్రాక్టర్ ను తగలబెట్టిన వైసిపి గుండాల పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పోలీసుల ఏకపక్ష నిర్ణయంతో రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని మండిపడ్డారు. కేంద్ర హెూం శాఖ జోక్యం చేసుకొని రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాలని చదలవాడ కోరారు.

ప్రదర్శనకు తీసుకెళ్లిన ట్రాక్టర్ దహనం

ప్రజాశక్తి-కారంపూడి

మండలంలోని మిర్యాలలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రతిష్ట కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి శుక్రవారం పాల్గొన్న విషయం తెలిసిందే. గ్రామ పొలిమేర నుండి గ్రామంలోకి బత్తుల ఆవులయ్య తన ట్రాక్టర్‌పై ఆయన్ను ఊరేగింపుగా తీసుకెళ్లడంతో గ్రామంలోని వైసిపి నాయకులు రాత్రికి రాత్రికి ఆ ట్రాక్టర్‌ను తగలబెట్టారు. ఈ నేపథ్యంలో బ్రహ్మారెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండల టిడిపి నాయకులు మిర్యాలకు వెళ్లి ఆ ట్రాక్టర్‌ను పరిశీలించారు. ఆవులయ్యకు ధైర్యం చెప్పి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం సిగ్గుమాలిన చర్యని టిడిపి నాయకులు విమర్శించారు. నియోజకవర్గంలోని బిసిలను లక్ష్యంగా చేసుకుని వైసిపి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.ఈ ఘటనకు కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. మిర్యాలకు వెళ్లిన వారిలో పి.అంజయ్య, మండల టిడిపి అధ్యక్షులు యు.లక్ష్మీనారా యణ, కె.బాలకృష్ణ, జి. సురేష్ యాదవ్, సిహెచ్ రాము, పి.లక్ష్మయ్య, కిరణ్ పాల్గొన్నారు.

వైసిపి నాయకుల అంతు చూస్తాం : యరపతినేని

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

వచ్చే ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే వైసిపి నాయకుల అంతుచూస్తామని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీని వాసరావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని, రాష్ట్రంలో టిడిపి నాయకులపై దాడులు, యువ గళం పై ఆంక్షలు పెట్టడం,గన్నవరం టిడిపి కార్యాలయం పై వైసిపి వారే దాడి చేసి తమ నాయకులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారంటూ మండిపడ్డారు. కొందరు పోలీసులు అధికార వైసిపి నాయకులు మాటలు విని టిడిపి నాయకులపై కేసులు పెడుతున్నారని, భవి ష్యత్తులో వారు ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. చంద్రబాబునాయుడుపై కొడాలి నాని తన నోటికొచ్చినట్లు మాట్లాడటం తగదని, రేపు తాము అధికారంలోకి వస్తే రోడ్డుపై కొడాలి నానిని కొట్టుకుంటూ తీసుకెళ్తామంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గురజాల నియోజకవర్గంలో పొందుగల-నార్కెట్ పల్లి హైవే రహదారికి కాసు బ్రహ్మానంద రెడ్డి పేరు పెడుతూ ప్రభుత్వం ఇటీవల సర్క్యులర్ జారీ చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ హైవేకు కాసు కుటుంబానికి సంబంధ మేంటని ప్రశ్నించారు. పుల్లరి పోరాటయోధుడు కన్నెగంటి హనుమంతు, పల్నాటి బ్రహ్మ నాయుడు, నాయకురాలు నాగమ్మ, కన్నమదాసు పేరు గాని పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాచవరం మండలం రేగుల గడ్డ ప్రాంతంలో నీళ్లలో నుంచి వెళ్లి మరి వైసిపి నాయకులు అక్రమ మైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. గురజాల ఎమ్మెల్యే

కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అవినీతి మూడు పువ్వులు ఆరు కాయ లుగా వర్ధిల్లుతోందని, 20 ఎకరాల భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. మాచర్ల టిడిపి ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డిని కారంపూడి మండలంలోని మిర్యాలలో ట్రాక్టర్‌పై ఊరేగించారనే కోపంతో బత్తుల ఆవు లయ్యకు చెందిన ట్రాక్టర్‌ను వైసిపి నాయకులు తగుల బెట్టారని ఆరోపించారు. ఓటర్ల వెరిఫికేషన్ లో కూడా టిడిపి నాయకులు అప్ర మత్తంగా ఉండాలని, కష్టపడి పని చేసిన ప్రతి కుటుంబానికి పార్టీ అండగా ఉం టుందని చెప్పారు.

నేడు రాష్ట్ర మహిళా సంఘం వజ్రోత్సవ మహాసభ

ప్రజాశక్తి- దుగ్గిరాల

మండలంలోని చిలువూరు గ్రామంలో ఆదివారం రాష్ట్ర మహిళా సంఘం వజ్రోత్సవ మహాసభను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 75 ఏళ్ల క్రితం చిలువూరు గ్రామంలో మొట్టమొదటి మహిళా సంఘం సభ జరిగిందని చెప్పారు. ప్రస్తుతం నేడు జరిగే మహాసభలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి శ్రీనివాస కుమారితో పాటు అనేకమంది మహిళా ప్రముఖులు పాల్గొననున్నారు. గ్రామంలోని రామ తులసి కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, బహిరంగ సభతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దుగ్గిరాలలో వెల్డింగ్ మిషన్ అందజేస్తున్న టిడిపి నాయకులు

వెల్డింగ్ మిషన్లు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని ఎస్కె మక్బుల్ బాషా, పి.రత్నాకర్‌లకు టిడిపి నాయకులు శనివారం రెండు వెల్డింగ్ మిషన్లు అందజేశారు. ఫ్యాబ్రికేషన్ పనులు చేస్తున్న ఇరువురికి సొంత వెల్డింగ్ మిషన్ లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారు నారా లోకేశ్‌కు అర్జి పెట్టుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు టిడిపి పట్టణాధ్యక్షుడు వి.వెంకట్రావు, ఇమ్రాన్, ఎ.కోటేశ్వరరావు, ఎస్కె నాగుల్ మీరా, చెన్నయ్య, కె.రమేశ్, పి.రమణ, టి. వెంకన్న, మోహన్.టి.శ్రీను, కె.విజయ్ ఆధ్వర్యంలో మిషన్లు అందజేశారు.

ప్రజాశక్తి -దుగ్గిరాల

చిలువూరు గ్రామానికి చెందిన కార్మికుడు షేక్ అమీర్ దుగ్గిరాలలో వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తనకు వెల్డింగ్ మిషన్ కావాలని కోరగా శనివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకి దేవి, వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత, మండల కార్యదర్శి తాళ్ల అశోక్ చేతుల మీదుగా నారా లోకేష్ పంపించిన వెల్డింగ్ మిషన్‌ను కార్మికునికి అందించారు. ఈ కార్యక్రమంలో ఉన్నం ఝాన్సీ ,ఆరుద్ర భూలక్ష్మి ,షేక్ జలాలుద్దీన్ , సాదిక్ , పి .హర్ష పాల్గొన్నారు.

ఆరోపణలకు ఖండన

ప్రజాశక్తి-తాడేపల్లి

గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తనపై అసత్య ఆరోపణలు చేస్తున్న ముగ్గురోడ్డుకు చెందిన పీటర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పాస్టర్ విజయ్‌బాబు తెలిపారు. శనివారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొంతకాలంగా తనను రూ.10 లక్షలు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. తాను డిమాండ్ చేసిన మొత్తం ఇవ్వకపోతే అంతుచూస్తానని వార్నింగ్ ఇచ్చాడని వాపోయారు. వాళ్ల కుటుంబానికి సంబంధించిన 9 సెంట్ల ఇంటి స్థలాన్ని తన పేర రాయించుకున్నానన్నది పచ్చి అబద్ధమని చెప్పారు. వాళ్ల కుటుంబ సమస్యను తనకు ఆపాదించి బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు.వ్యక్తిగతంగా తనపై కక్ష పెట్టుకుని 'ఫేక్ పాస్టర్ ఫేక్ ఫ్యామిలీ' అంటూ అసత్య ఆరోపణలు చేయడం మంచిపద్ధతి కాదని హెచ్చరించారు. పీటర్ ఆరోపించినట్లు తాను ఎక్కడా ఉచితంగా స్థలాలు వస్తాయని చెప్పలేదని అన్నారు. పీటర్ పాల్ ఆరోపణలపై అతని సోదరుడు జోషి మాట్లాడుతూ తన తమ్ముడు చెప్పే వన్నీ పూర్తిగా అవాస్తవాలని అన్నారు. తమ స్థలం విషయంలో విజయ్‌బాబుకు ఎటువంటి సంబంధం లేదని చెప్పారు. తన అన్న మానసిన పరిస్థితి కూడా బాగోలేదని వెల్లడించారు. పీటర్ పిల్లల స్కూల్ ఫీజ్, ఇంటి అద్దె కూడా ఒకసారి చెల్లించి విజయ్‌బాబు ఆదుకున్న సంగతిని గుర్తుచేశారు. సమావేశంలో పాస్టర్‌కు మద్దతుగా పలువురు సంఘస్తులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

జిఎన్‌టి-6 ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్న లేఅవుట్స్‌లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని, రానున్న ఉగాదికి గృహప్రవేశాలకు సిద్దం కానున్నాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. శనివారం కమిషనర్ ఏటుకూరు జగనన్న లేఅవుట్‌లో జిఎంసి ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న లేఅవుట్స్‌లో లబ్దిదారులు ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం చేసుకోవాలని, అందుకు తగిన తోడ్పాటును అందిస్తామన్నారు. ఇళ్ళ నిర్మాణ కాంట్రాక్టర్లు బ్రిక్స్ నిర్మాణ యూనిట్లు కూడా లేఅవుట్‌లోనే ఏర్పాటు చేసుకుంటున్నారని, పనులు వేగంగా చేయాలని, మార్కింగ్, బిల్స్ ప్రాసెస్ ఎమినిటి కార్యదర్శులు ఎప్పటికప్పుడు చేస్తారని తెలిపారు. కాంట్రాక్టర్ తప్పనిసరిగా ప్రతి రోజు నిర్దేశిత లక్ష్యానికి తగిన విధంగా పనులు చేయాలని, రోజువారి నివేదిక ఎప్పటికప్పుడు తమకు అందించాలన్నారు. ఎమినిటి కార్యదర్శులకు లబ్దిదారుల మ్యాపింగ్, వివరాల సేకరణ, ఆన్‌లైన్ కోసం అడ్మిన్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ కార్యదర్శులు, సచివాలయ వాలంటీర్లు సహకరించాలని స్పష్టం చేశారు. లేఅవుట్‌లో ఎక్కడైనా విద్యుత్ స్థంబాల అవసరం ఉంటే ముందే సదరు శాఖ అధికారులకు తెలియచేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు తమ పరిధిలో వాలంటీర్లతో కలిసి లబ్దిదారులకు ఇళ్ళ నిర్మాణాలపై అవగాహన కల్గించి, ప్రస్తుతం లేఅవుట్స్‌లో జరుగుతున్న నిర్మాణాల వివరాలు తెలియ చేయాలని ఆదేశించారు.పర్యటనలో నగరపాలక సంస్థ ఎస్.ఈ. భాస్కర్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కష్ణయ్య, ఈ.ఈ. కొండారెడ్డి, డి.ఈ.ఈ.లు శ్రీనివాసరెడ్డి, కళ్యాణ రావు, హౌసింగ్ ఈ.ఈ. శంకర్రావు, డి.ఈ.ఈ.లు, ఏ.ఈ.లు పాల్గొన్నారు.

నాడు- నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి -దుగ్గిరాల

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా నాడు-నేడు పనులపై అధికారులు అప్రమత్తమై దృష్టి పెట్టాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అధ్యాపకులను కోరారు. మండలంలోని పెద కొండూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌ను శనివారం ఆయన పరిశీలించారు. నాడు-నేడు నిధుల వినియోగంపై ఆరా తీశారు .అధికారుల పనితీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రతిపాదనలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అవసరాలు తెలపాలని అధ్యాపకులను కోరారు. నాలుగో తరగతి విద్యార్థుల పుస్తకాలు పరిశీలించిన అనంతరం ఎనిమిదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యాశాఖ అందించిన

అధికారులతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్

ట్యాబ్‌లను వినియోగించుకొని సామర్థ్యాన్ని పెంచుకోవాలని వారికి సూచించారు. తరగతి గదిలో ఉన్న పరికరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. కోడిగుడ్లు పరిశీలించిన అనంతరం మెనూ అమలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జెడి సుబ్బారావు డిఈఓ శైలజ, డిప్యూటీ డిఈఓ నిర్మల, మండల విద్యాధికారి కె శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఏ రమేష్ రెడ్డి , అధికారులు పాల్గొన్నారు.

నేటి నుండి నరసింహుని బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో ఈనెల 26వ తేదీ నుంచి నరసింహుని బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని దేవస్థాన కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి శనివారం తెలిపారు. 26వ తేదీన స్వామివారి పెండ్లి కుమారుని ఉత్సవంతో ప్రారంభమై 9వ తేదీన స్వామివారి శ్రీ పుష్పయాగోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. 27న రాత్రి ధ్వజారోహణం, 28న హనుమంత వాహనం, మార్చి 1వ తేదీన రాజాధిరాజ వాహనం, 2న యాలి వాహనం, 3న సింహ వాహనం, 4న గజ వాహనం, 5న పొన్న వాహనం, 6న శ్రీవారి కళ్యాణ మహోత్సవం, 7న స్వామివారి దివ్య రథోత్సవం, 9న శ్రీ పుష్పయాగోత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ఎదుట ఉన్న శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళావేదికలో ప్రతిరోజు బ్రహ్మోత్సవాల్లో రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసామన్నారు. సందర్శకులు అధిక సంఖ్యలో బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ టి.వి.నారాయణ

ప్రజాశక్తి-తెనాలి

ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ టివి నారాయణ చెప్పారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల్లో శనివారం ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్, అసోసియేషన్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో 'రోల్ అండ్ ఫ్యూచర్ ప్రాస్పెక్ట్స్ ఆఫ్ రెగ్యులేటరీ అఫైర్స్' అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. సెమినార్ కన్వీనర్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ టివి నారాయణ మాట్లాడుతూ ఫార్మసిస్ట్ వ్యాక్సినేటర్‌గా కూడా ఉండాలన్నారు. ఈ మేరకు ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ తరపున మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ సర్వీసెస్‌కు వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. మలేషియా నుంచి వచ్చిన డాక్టర్ సునీల్ కుమార్ 'జనరిక్ బిజినెస్', రెగ్యులేటర్ ఎఫైర్స్ ఏజన్సీ రోల్ ఆన్ డ్రగ్ డెవలప్‌మెంట్ అంశంపై ప్రసంగించారు. డాక్టర్ రావ్ వడ్లమూడి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచకుంటే జాతీయ, అంతర్జాతీయంగా కూడా మంచి భవష్యత్ ఉంటుందన్నారు. తొలుత వివిధ రాష్ట్రాల కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పోస్టర్ ప్రదర్శన, రెగ్యులేటరీ అఫైర్స్‌పై ఈ-పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కర్నాటక అధ్యక్షులు శివకుమార్, ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్, సైంటిఫిక్ కన్వీనర్ డాక్టర్ వి.కోటిరెడ్డి, రోసోర్స్ పర్సన్లు ఉమెన్ ఫోరం కన్వీనర్ డాక్టర్ పద్మలత, ఏపిటిఐ వైస్ ప్రెసిడెంట్స్ డాక్టర్ వై.అంకమ్మచౌదరి, డాక్టర్ వై.లక్ష్మణరావు, సెక్రటరీ డి.నరేంద్ర, ఐపిఏ ఎపి శాఖ కార్యదర్శి ఎం.ప్రసాదరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న జి. శేఖర్‌బాబు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

విద్యార్థులు మాదకద్రవ్యాలు అలవాటు చేసుకోవడం నిప్పుతో చెలగాటమేనని,వాటికి దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ జి.శేఖర్‌బాబు హెచ్చరించారు. శనివారం అమరావతి కరకట్టపై గల చిగురు ఆశ్రమంలో డాన్ బాస్కో యార్ యూత్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు మేల్కొనడంతో పాటు పక్కన యువకులను కూడా మత్తుకు దూరంగా ఉండేలా చూడాలని కోరారు. ఈ వ్యసనానికి బానిసైన వారు తమ శరీరంపై అదుపు కోల్పోతారని హెచ్చరించారు. మానసిక స్థితి క్రమేపి అధ్వానంగా ఉంటుందని చెప్పారు. మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలను స్క్రీన్‌పై ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. మత్తుకు బానిసైన వారిని బయటకు తీసుకురావడానికి డి-అడిక్షన్ చికిత్స ద్వారా బయటపడేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బాలభవన్ జోనల్ కో-ఆర్డినేటర్ జె.ఆంజనేయులు, బి.రమేశ్ పాల్గొన్నారు.

మేడికొండూరు ఎస్ఐగా మధుపవన్

ప్రజాశక్తి- మేడికొండూరు

ఎస్ఐ మధుపవన్

మేడికొండూరు మండలం నూతన ఎస్ఐగా మధు పవన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు కొత్తపేటలో విధులు నిర్వహిస్తున్న మధు పవన్ సాధారణ బదిలీల్లో భాగంగా మేడికొండూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించడంలోనూ, శాంతి భద్రతల పరిరక్షణలోనూ తన వంతు కృషి చేస్తానని అన్నారు. . మండలంలో సమస్య ఆత్మకమైన గ్రామాల అభివవృద్ధి ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు.

చెక్కబల్ల బండిని అందజేస్తున్న టిడిపి నాయకులు

చెక్కబల్ల బండి అందజేత

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని టిడ్కో గృహ సముదాయంలో ఉన్న చిరు వ్యాపారి తురక భారతికి నారా లోకేష్ సహకారంతో శనివారం గృహ సముదాయంలో టిడిపి నాయకులు చెక్కబల్ల బండి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ రియాజ్, కరిముల్లా, బి శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్ మజీద్, వాకా మాధవరావు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాటం

ప్రజాశక్తి - తుళ్లూరు

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు జి జాన్ పాల్ అన్నారు.శనివారం దొండపాడులో మాల మహానాడు తాడికొండ నియోజక వర్గ కన్వీనర్ సరిగల శ్రీనివాసరావు అధ్వర్యంలో జరిగింది. సమావేశంలో జాన్ పాల్ మాట్లాడుతూ మాలల హక్కులు, షెడ్యూల్డ్ కులాల ఐక్యత కోసం మాల మహానాడు కృషి చేస్తోందని చెప్పారు. మేడి కొండూరు, తాడికొండ మండలం కన్వీనర్ లుగా మిరియాల శివయ్య, సముద్రాల శాంసోనులను నియమించారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దారా హేమ ప్రసాద్, కొప్పుల శేషగిరి రావు,మాతంగి చెన్న కేశవులు,కొప్పుల ఆంద్రెప్ప పాల్గొన్నారు.

మన హీరోలు పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జయరాజ్, కెఎస్ లక్ష్మణరావు, విప్లవ్ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రకృతి ప్రసాదించిన వనరులన్నింటినీ మానవుడు స్వార్థ ఆలోచనలతో నిర్వీర్యం చేస్తున్నాడని ప్రజాకవి జయరాజ్ అన్నారు. శనివారం గుంటూరు బ్రాడీపేట, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో యూత్ ఫర్ బెటర్ ఏపీ ఆధ్వర్యంలో 'మన హీరోలు' పుస్తక ఆవిష్కరణలో జయరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సినిమాలో నటించే వారినే హీరోలని పిలుస్తూ, మన మధ్య తిరుగుతున్న అసలు హీరోలను గుర్తించట్లేదని అన్నారు. 50 మంది నిజమైన హీరోలను పరిశోధించి వారి గురించి సుబ్బు ఆర్వి ఒక పుస్తకం రచించడం ఎంతో ఆనందించదగిన విషయం అన్నారు. ఉన్నతమైన ఆశయాలతో ఉన్న సుబ్బుకి భవిష్యత్‌లో మరిన్ని మంచి అవకాశాలు రావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఇప్పటిదాకా గొప్పగొప్ప వారి కథలు మనం చదువుకున్నామని, సుబ్బు వల్ల మన మధ్య మనకి తెలియకుండా ఉన్న అసలు హీరోలను పుస్తకం ద్వారా పరిచయం చెయ్యడం గొప్ప ప్రయత్నమని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు దొంత సురేష్, వి.భగవాన్‌దాస్, స్వచ్ఛంద ప్రసాద్, తెలంగాణ హైకోర్టు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదులు విప్లవ్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో 'ఎ డే విత్ కలెక్టర్'

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

విద్యార్థి దశలో ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పచుకుంటే యువతగా ఎదిగాక రాణించడానికి వీలవుతుందని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. 'ఎ డే విత్ కలెక్టర్' కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో చిలకలూరిపేట నియోజకవర్గ విద్యార్థులతో కలెక్టర్ శనివారం సమావేశమయ్యారు. విద్యార్థులు పెట్టుకున్న లక్ష్యాలపై వారితో మాట్లాడి వాటిని సాధించడానికి చేయాల్సిన కృషిపై పలు సూచనలు చేశారు. ఉన్నత చదువులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మెదడుకు పదును పెట్టేలా, సృజనాత్మక పెంపొందించేలా విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగి బాగా సమాధానం ఇచ్చిన వారికి బహుమతులు

విద్యార్థులతో మాట్లాడుతున్న పల్నాడు కలెక్టర్ శివశంకర్

తల్లి, దండ్రులను గౌరవిస్తూ ఉన్నతంగా రాణించాలని, ఆసక్తి ఉన్న అంశాల్లో నైపుణ్యం పెంచుకోవాలని చెప్పారు. తెలుగు, ఆంగ్ల భాషలపై పట్టు సాధించాలన్నారు. మంచి అలవాట్లు నేర్చుకోవడంతో పాటు మహనీయుల జీవిత చరిత్ర, ప్రముఖుల జీవన విధానాన్ని తెలుసుకోవాలని, సామాజిక అంశాల పట్ల పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. అందరూ తాము ఎంచుకున్న రంగాల్లో ఉన్నతంగా రాణించి చదివిన విద్యాసంస్థలకు, సొంతూరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల నుండి 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కలుపు మందు వేస్తే మాడిపోతున్న పైరు

ప్రజాశక్తి - దుగ్గిరాల

తాను అడిగిన కంపెనీకి చెందిన కలుపు మందు కాకుండా షాపు యజమాని వేరే కంపెనీ మందు ఇచ్చాడని, ఆ మందు వేయడంతో తన పొలంలోని పైరు నాశమైందని మండలంలోని పెనుమూలికి చెందిన కౌలురైతు ఓసూరి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న పైరుకు కలుపు మందు కోసం తెనాలి రూరల్ మండలం కొలకలూరులోని పురుగు మందుల షాపు నుండి తంబోలా కంపెనీకి చెందిన కలుపు మందు ఈనెల నాలుగో తేదీన తెచ్చి పిచికారీ చేయగా అప్పటివరకు ఏపుగా పెరిగిన పైరు ఆకులు కాలిపోయి పైరు వాడిపోయింది. ఈ విషయాన్ని దుకాణదారునికి బాధిత రైతు వివరించగా ఆయన కంపెనీ ప్రతినిధులకు తెలిపారు. వీరంతా కలిసి పొలాన్ని శనివారం పరిశీలించారు. ఇదే మందును పిచికారీ చేసిన ఇతర పొలాలను పరిశీలించి దాని ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని, ఆదివారం మరోసారి వస్తామని కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని, లేకుంటే నిండా నష్టాల్లో మునిగిపోతానని బాధిత రైతు వాపోతున్నాడు.

ఆర్‌విఆర్ అండ్ జెసిలో బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - గుంటూరు

ఉపాధ్యాయ వృత్తిలో ఒత్తిడిని అధిగమించి, శారీరక, మానసిక ఆనందమయ జీవితానికి ఉపాధ్యాయులకు క్రీడలు ఎంతో అవసరమని గుంటూరు అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు కె.కోటేశ్వరరావు అన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో 48వ ఏపీ కాలేజి టీచర్స్ బాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయ వత్తిలో ఒత్తిడిని అదిగమించి ఆనందమయ జీవితాన్ని పొందటానికి క్రీడలు ఎంతో అవసరమని, ఈ క్రీడలు ఉపాధ్యాయులకు గుర్తుండిపోతాయని అన్నారు. అపజయం విజయానికి మార్గంగా తీసుకోవాలని

పోటీలను ప్రారంభిస్తున్న ఎఎస్‌పి కోటేశ్వరరావు

సూచించారు. కళాశాల అధ్యక్షులు రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులతోపాటు, అధ్యాపకులకూ క్రీడలకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పోటీల్లో 112 జట్లు తమ పేర్లు నమోదు చేసుకున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నుండి టి.కృష్ణప్రసాద్, ఎ.విప్లవ్ వంశీ వ్యవహ రించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ఏపీ కాలేజి టీచర్స్ బాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సి.చంద్రశేఖర్, డైరెక్టర్లు డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.గిరీశంకర్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో తైక్వాండో శిక్షణ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

హెచ్‌ఎం, శిక్షకునికి పుస్తకాలు ఇస్తున్న నాయకులు

పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్తు పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆద్వర్యంలో తైక్వాండోలో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తుండగా శిక్షణను పాఠశాల హెచ్‌ఎం ధనలక్ష్మి శనివారం ప్రారంభించారు. విద్యార్థులంతా శ్రద్ధగా నేర్చుకోవాలని, ఇలాంటి వాటివల్ల క్రమశిక్షణ అలవడ్డంతోపాటు శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందని చెప్పారు. శిక్షకులు ఆనంద్‌కు ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.సాయికుమార్, డివైఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు కృతజ్ఞతలు తెలిపారు.

కృష్ణా నదిలో నేడు ఈత పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆక్వా డెవిల్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 గంటలకు కృష్ణానదిలో దుర్గా ఘాట్ నుండి అమరావతి కరకట్ట వైపు లోటస్ ఫుడ్ సిటీ సమీపంలోని కృష్ణానదిలో ఈత పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ సెక్రటరి ఎం. లక్ష్మినరసరాజు శనివారం తెలిపారు. ఐదు విభాగాలుగా ఈ పోటీలు జరుగుతాయన్నారు. 11-18 ఏళ్ల వారికి, 19-30 ఏళ్ల వారికి, 31-34 ఏళ్ల వారికి, 46-60 ఏళ్ల వారికి, 61 ఏళ్లు పైబడిన వారికి వేర్వేరుగా పోటీలు ఉంటాయని చెప్పారు. పాల్గొంటున్న అభ్యర్థుల రక్షణ కోసం పడవులు, లైఫ్ జాకెట్లు, రబ్బరు ట్యూబ్‌లు, అనుభవజ్ఞులైన ఈతగాళ్లు పక్కనే ఉండి పర్యవేక్షిస్తారని తెలిపారు. వీరితో పాటు అత్యవసర వైద్యబృందం, మెడికల్ కిట్, అంబులెన్స్ అందుబాటులో ఉంటాయన్నారు. పోటీలు అనంతరం బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

టిడిపి నేతల్లో దిగులు, గుబులు!

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పలు నియోజకవర్గాలకు చెందిన టిడిపి నేతల్లో అయోమయం నెలకొంది. నాలుగేళ్లుగా పార్టీ బాధ్యతలు నిర్వహిస్తున్న వారికి పోటీగా కొత్త నేతలు రంగప్రవేశం చేస్తున్నారు. ఈ పరిణామం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు మింగుడు పడటం లేదు. ఎన్నికలకు ఏడాది ముందు కొత్త నేతలు ఆగమనంతో తమ భవిష్యత్తు ఏమిటో తెలియక ఇన్‌ఛార్జుల్లో గందరగోళం ఏర్పడింది. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ రెండు రెండ్రోజుల కిందట టిడిపిలో చేరారు. చాలా కాలంగా ఆయన పార్టీలో చేరతారని ప్రచారమవగా ఎట్టకేలకు గురువారం ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కన్నా రాకతో గుంటూరు పశ్చిమ, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో కలకలం బయలుదేరింది. ఆయన గతంలో పెదకూరపాడులో నాలుగు సార్లు, గుంటూరు పశ్చిమ నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో గుంటూరు నుంచి ఓడిపోయారు. ఈ మూడు నియోజకవర్గాల్లో ఆయన ఏదోఒక చోట నుంచి పోటీ ఖాయంగా కనిపిస్తోంది. కన్నా ఎక్కువగా గుంటూరు పశ్చిమ వైపు దృష్టి సారించినట్టు తెలిసింది. ఈ మూడు నియోజకవర్గాల నుంచి పోటీకి సిద్ధం అని చెప్పుకుంటున్న టిడిపి నాయకులకు మాత్రం కంటిపై కునుకు కరువైంది.

మరోవైపు తాడికొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా ఉన్న జిల్లా పార్టీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్‌కు పోటీగా తోకల రాజవర్ధన్‌కు మాజీ ఎంపి రాయపాటి సోదరులు బాహాటంగానే మద్దతు పలికారు. రాజవర్ధన్ తాడికొండ అభ్యర్థిగా రాయపాటి వర్గీయులు చేస్తున్న ప్రచారం శ్రావణ్‌కుమార్ గ్రూపునకు మింగుడు పడటం లేదు. మరోవైపు కన్నా పార్టీలో చేరితో స్వాగతిస్తానని రాయపాటి సాంబశివరావు తొలుత ప్రకటించినా ఆయన చేరిక ఖరారు కాగానే కన్నాను ఓడిస్తామని రాయపాటి చేసిన ప్రకటన టిడిపిలో కలకలం రేపింది.

జనసేనతో టిడిపి పొత్తు ఖరారైతే ఆ పార్టీకి కేటాయించే సీట్లపైనా టిడిపిలో అయోమయం నెలకొంది. ప్రస్తుతానికి తెనాలి, సత్తెనపల్లి స్థానాలపై జనసేన దృష్టి సారించింది. ఇప్పటి వరకు పార్టీ జెండా భుజాన వేసుకుని తిరిగిన సీనియర్ నాయకులు సైతం తమ పరిస్థితి ఏమిటన్నదీ తెలియక ప్రత్యామ్నాయ మార్గాలపై వైపు దృష్టి సారిస్తున్నారు. తెనాలిలో జనసేన సీనియర్ నేత నాదెండ్ల మనోహర్ పోటీ చేసే అవకాశాలు ఉండటం వల్ల ఆ స్థానంలో టిడిపికి పోటీ చేసే అవకాశం ఉండదని ప్రచారమవుతోంది. దీంతో ఇప్పటి వరకు ఈ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. మూడేళ్లుగా సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి టిడిపికి ఇన్‌ఛార్జి లేరు. మాజీ ఎమ్మెల్యే వైవి.ఆంజనేయులు, కోడెల శివప్రసాద్ కుమారుడు శివరాం, నాగౌత్ శౌరయ్య, రామస్వామి తదితరులు సీటు కోసం పోటీ పడుతున్నారు. జనసేనకు సీటు కేటాయిస్తే తమ పరిస్థితి ఏమిటన్నదీ వీరికి అంతుబట్టడం లేదు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి టిడిపిలో అధిక పోటీ ఉంది. కన్నా సత్తెనపల్లి నుంచి పోటీ చేస్తే గుంటూరు టిక్కెట్ కోసం ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర మూడేళ్లుగా ఇన్‌ఛార్జిగా ఉండగా తాజాగా ఉయ్యూరు ఫౌండేషన్ అధినేత ఉయ్యూరు శ్రీనివాసరావు, రియల్టర్ భాష్యం ప్రవీణ్ వంటి వ్యాపారులు స్వల్ప దాన ధర్మాలతో ఎన్నికల్లో పోటీకి సిద్ధం అన్నట్టుగా పార్టీ నేతలకు సంకేతాలు పంపుతున్నారు.

(ఎ.వి.డి.శర్మ)